teluguislam.net



# జిహార్ ఆదేశాలు

**124వ అంశం : భార్యను తల్లి అనో, చెల్లి అనో చెప్పి తన కొరకు నిషేధించుకోవటం తగదు. షరీఅత్‌లో ఈ చేష్టను 'జిహార్' అంటారు.**

**125వ అంశం : 'జిహార్'కు పాల్పడినంతమాత్రాన ఇల్లాలు శాశ్వతంగా నిషిద్ధం (హరామ్) అవదు. కాకపోతే ఆమె వద్దకు పోయే ముందు పరిహారం (కఫ్ఫారా) చెల్లించాలి.**

**126వ అంశం : 'జిహార్'కు పాల్పడినవారు పరిహారంగా ఒక బానిసను విడుదల చేయాలి లేదా నిరంతరం రెండు నెలలు ఉపవాసం పాటించాలి. లేదంటే అరవైమంది నిరుపేదలకు అన్నం పెట్టాలి.**

"మీలో ఎవరయినాసరే తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించినంత మాత్రాన (నీవు నా తల్లి వీపులాంటిదానవు అని నోరుజారినంత మాత్రాన) వారు వారికి తల్లులైపోరు. వారిని కన్నవారు మాత్రమే వాస్తవానికి వారికి తల్లులు. నిజానికి ఈ విధంగా పలికేవారు అసహ్యామైన మాటను, అబద్ధాన్ని పలికారు. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, క్షమాభిక్ష పెట్టేవాడూను. ఎవరైనా తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించి, తమ నోటిద్వారా జారి పోయిన(తప్పుడు) మాటను ఉపసంహరించుకుంటే వారు ఒకరినొకరు తాకకముందే అతను ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించాలి. దీనిద్వారా మీకు గుణపాఠం నేర్పబడుతున్నది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు. ఈ స్థోమతలేనివాడు, భార్యాభర్తలు పరస్పరం ముట్టు కోకముందే అతను రెండు మాసాలపాటు ఎడతెగకుండా ఉపవాసాలు పాటించాలి. ఈపాటి శక్తి కూడా లేనివాడు 60మంది అగత్యపరులకు అన్నం పెట్టాలి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై మీ పరిపూర్ణ విశ్వాసం రూఢీ కావటానికే ఇది మీపై విధింపబడింది. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. అవిశ్వాసులకు బాధాకరమైన శిక్ష ఖాయం." (అల్ ముజాదలా:2-4)

**127వ అంశం : జిహార్‌ను ప్రయోగించినవాడు పరిహారం చెల్లించకముందే తన భార్యతో సమాగమం జరిపితే పశ్చాత్తాపం ప్రకటించాలి. మళ్లీ పరిహారం చెల్లించనవసరం లేదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒక వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్(స) దగ్గరకు వచ్చాడు- అతను తన భార్యపై 'జిహార్' అస్త్రం ప్రయోగించాడు. కాని పరిహారం (కఫ్ఫారా) చెల్లించక ముందే భార్యతో రమించాడు. 'ఓ దైవప్రవక్తా(స)! నేను నా భార్యపై జిహార్‌ను ప్రయోగించాను. కాని పరిహారం ఇవ్వకముందే ఆమెతో సమాగమం జరిపాన'ని అతను తన గోడు వినిపించుకున్నాడు. దానికి ఆయన(స), "అల్లాహ్ నీపై దయదలచుగాక! ఇంతకీ ఏ విషయం నిన్ను దీనికి పురికొల్పిందో చెప్పావు కాదు" అని అడిగితే, 'నేను వెన్నెలలో ఆమె పాద భూషణమును చూశాను. (అంతే. నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను) అన్నాడతను. దానికాయన(స), "సరేలే. పరిహారం చెల్లించనంతవరకూ ఇక ఆమె వద్దకు పోకు" అని ఉపదేశించారు. (తిర్మిజీ-1199, ఇబ్నెమాజా-2065, అబూదావూద్-2221 హసన్).